ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 సంచిక : 02 అక్టోబర్ 2009



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

☎ 08814 - 224747

9247104551


ఈ సంచికలో....


జిన్నూరు ............ 19-07-09

అయి భీమవరం ... 01-09-09

చింతపర్రు ........... 06-09-09



ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-07-2009, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏసు ప్రభువు గొఱ్ఱెలకాపరి, కృష్ణుడు గోవుల కాపరి. ఆ గొఱ్ఱెలమూ మనమే, ఆ గోవులమూ మనమే. నేను గొఱ్ఱెలకాపరిని అని ఏసు చెప్పలేదు, నా గొఱ్ఱెలకు నేను కాపలాదారిని అని చెప్పాడు. నా గొఱ్ఱెలు అంటే ఆయనపట్ల విశ్వాసం కలిగిఉన్నవారిని, తరింపచేసే వరకూ వారిని విడిచిపెట్టడు. మీరు అందరూ శ్రద్ధగా వస్తున్నారు. మీరు అందరూ తరించాలి. భవిష్యత్తులో మీకు శరీరాలురావటం ఆగిపోవాలి. ఏ స్థితిని పొందిన తరువాత దానితోటి సమానమైన సుఖంగాని, దానికి మించిన సుఖంకాని లేదు అని తెలుస్తుందో ఆ స్థితిని పొందు అర్జునా అని పరమాత్మ చెప్పాడు. అంటే మీరు కూడా అటువంటి సుఖాన్ని పొందాలి. లేకపోతే ప్రయోజనం ఏమిటి? మనం అమృతస్థితిని పొందాలి, మనం మోక్షస్థితిని పొందాలి. మన శరీరానికి రోగం వస్తే శరీరం బాగుచేసుకుంటాము, మన ఇల్లు పాడైపోతే ఇంటిని బాగుచేసుకుంటాము, కాని మనందరం మనస్సుని బాగుచేసుకోము. మనస్సు దగ్గరకి వచ్చేటప్పటికి అందరికీ బద్ధకమే, అశ్రద్ధయే. మనస్సుని బాగుచేసుకోవాలని కూడా మనకి తెలియటంలేదు. మనం చనిపోయిన తరువాత మన ఇల్లు మనకూడా రాదు. మన శరీరం మనకూడా రాదు, మన మనస్సు వస్తుంది. ఆ మనస్సునే జీవుడు అంటారు. మన శరీరం చనిపోయిన తరువాతకూడా వచ్చేజీవుడిని బాగుచేసుకోవటానికి కాని, వాడిని కండిషన్‌లో పెట్టుకోవటానికి కాని ఏమీ ప్రయత్నం చేయటం లేదు. మేము సాధన చేస్తున్నాము అని చెప్పేవారికి కూడా వారి మనస్సు

ఏమీ బాగుపడినట్టు కనబడదు. మీ మనస్సును మీరు బాగుచేసుకుంటూ ఉంటే దాని తాలుక శాంతి మీ మాటలో, చేతలో, మీ ప్రవర్తనలో తెలియాలి. మన మనస్సుని బాగుచేసుకోవటం చాలా కష్టం. ఎందుచేతనంటే మన పూర్వజన్మలనుండి వచ్చిన వాసనలు మనస్సుని అంటిపెట్టుకుని ఉంటాయి. మనం బాగుపడినా మన మనస్సే కారణం, మనం పాడైపోయినా మన మనస్సే కారణం. అందుచేత అన్నింటికంటే మనస్సుని బాగుచేసుకోవటం ముఖ్యం, మనోనిగ్రహం ముఖ్యం. కొండంత మనోనిగ్రహం ఉన్నవాడు కొండంత బాగుపడతాడు, కొండంత లాభం పొందుతాడు. గోరంత మనోనిగ్రహం ఉన్నవాడు గోరంత బాగుపడతాడు, గోరంత లాభం పొందుతాడు. మీరు మామూలు నిగ్రహంకాదు కొండంత మనోనిగ్రహం సంపాదించాలి. అప్పడు ఇహంలోని, పరంలోని కూడా మీకు కొండంత లాభం వస్తుంది.

రమణమహర్షిగారి శరీరాన్ని నేను చూడలేదు. నాకు రమణమహర్షిగారికి మానసిక అనుబంధం లేదు. నాకు ఆయన చుట్టాలు కాదు. రమణమహర్షి నాకు శరీరానికి సంబంధించినవారుకాదు, మస్సుకి సంబంధించినవారు కాదు. మా సంబంధం మనో దేహములకు అతీతమైనది. అది చైతన్యస్థాయిలో ఉన్నటువంటి అనుబంధం. అందుచేత ఎన్నిగాలివానలు వచ్చినా మాకు భగవాన్‌కి ఉన్న అనుబంధం పోలేదు. అది మానసిక అనుబంధం అయితే పోతుంది. అది చైతన్యానికి సంబంధించినది. ఆ మహాచైతన్యంలో చైతన్యం ఉంది కాని నేను ఉండదు. ఆ నేను లేనప్పడు స్నేహం శాశ్వతం. గురువు అనుగ్రహం మన దేహానికి సంబంధించినదికాదు, మన మనస్సుకి సంబంధించినది కాదు అది మనలను ఈ జననమరణ చక్రంలోనుండి, ఈ భ్రాంతిలోనుండి, ఈ మాయలోనుండి ఒడ్డుకి చేర్చే వరకూ విడిచిపెట్టదు. అది కళ్ళకు కనబడదు, చెవులకు వినబడదు. ఇట్టిదని మాటలతో చెప్పలేము. అటువంటి అనుబంధం మనకి గురువుతో కుదిరితే ఆయన అనుగ్రహం కలిగితే ఆయన స్వరూపాన్ని మనకి ఇచ్చేవరకూ మనల్ని విడిచిపెట్టడు ఆయన గురువు. సత్వగుణం, రజోగుణం, తమోగుణం ఈ మూడుగుణాలే మన చావుపుట్టుకలకు కారణం. గుణాలు విడిచిపెట్టి బయటకు రాకపోతే ఈ జననమరణ చక్రంలోంచి మనం బయటకు రాలేము. ఈ మూడుగుణాలు జయించినవాడిని బ్రహ్మజ్ఞాని అంటారు. సత్వగుణం ఉన్నపుడు మనం శాంతిగా, నిర్మలంగా ఉంటాము. రజోగుణం ఉన్నపుడు మన మనస్సు ఏదొక ఆకర్షణలోకి గెంటుకుంటూ వెళ్ళిపోతుంది. తమోగుణం ఉన్నప్పడు మొద్దులాగ ఉంటాము. మనకు ఒకోసారి సత్వగుణం వస్తూ ఉంటుంది, ఒకోసారి రజోగుణం వస్తూ ఉంటుంది, ఒకోసారి తమోగుణం వస్తూ ఉంటుంది. వచ్చినా అవి గుణాలే అవి నేను కాదు, వాటికి నాకు సంబంధం లేదు అని,

వాటికి వేరుగా ఉండి చూసిచూడనట్టు ఉంటే అవి వచ్చి వెళ్ళిపోతూ ఉంటాయి. వాటితో జతచేయకు. జ్ఞానికి కూడా పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి ఈ గుణాలు వస్తూ ఉంటాయి, వచ్చినా జ్ఞాని వాటితో జతకట్టడు.

మన శరీరానికి దురదవస్తే ఏదో ఆయింట్‌మెంట్ రాసుకుని తగ్గించుకోవచ్చు కాని మీకు కీర్తికాంక్ష వస్తే తగ్గించుకోలేరు. అసలు రాకుండా ఉండాలికాని కీర్తికాంక్ష వస్తే తగ్గించుకోవటం చాలా కష్టం. మనకు ఏదైనా బలహీనత ఉంటే అది తొందరగా పోదు. మన ప్రయత్నం ఉండాలి, కాలం కలిసిరావాలి, గురువు అనుగ్రహం, దైవానుగ్రహం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిసివస్తే గాని ఆ బలహీనతలోంచి మనం బయటకు రాలేము. కీర్తి కాంక్ష కూడా ఒక బలహీనతే. మీరు ఏదైనా పని చేస్తే అహంభావన లేకుండా, కీర్తికాంక్ష లేకుండా ఆ పని పనికోసమే చేయండి. గౌరవంకోసం మీరు పనిచేస్తే దేహగతమైననేను పెరిగిపోతుంది. అందుచేత గొప్పలకోసం ఏ పని చెయ్యకూడదు. మనకి గొప్పలకోసం పనిచెయ్యాలని అనిపిస్తే అప్పడు మనం రజోగుణంలో ఉన్నామని అర్థం. మనకు మోక్షం కావాలి అంటే మన శరీరం ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే మన జీవితాన్ని భగవంతునికి అంకితం చేసుకోవాలి. ఇది గారడీమాటల వల్ల వచ్చేదికాదు. ఎవరైతే బ్రాహ్మీస్థితిని పొందటానికి తన జీవితాన్ని అంకితం చేసుకుంటారో వారు మాత్రమే బ్రాహ్మీస్థితిని పొందగలరు. అలాగని మీరు చేసే ప్రయత్నాలకు ఉపకారము ఉండదనికాదు. మీరు ఇప్పడు ఎంతోకొంత ప్రయత్నం చేస్తున్నారు, ఈ జన్మలోకాకపోయినా రాబోయే జన్మలోనైనా దానికి ఎంతోకొంత ఫలితం ఉంటుంది. చేసే సాధనకాని, చేసే ప్రయత్నంకాని వ్యర్థంకాదు. ఇది రాబోయే జన్మలలో మీకు కలసివస్తుంది అని పరమాత్మ చెప్పాడు. మనం కాని దేహంతోటి, మనంకాని మనస్సుతోటి, మనంకాని లోకంతోటి మనం ఐక్యమైపోతున్నాము. మనం ఏదైతే అవునో దానితోటి ఐక్యమవ్వలేకపోతున్నాము. ఇప్పడు నీ శరీరంతోటి నీకు ఎంత తాదాత్మ్యం ఉందో, నీ మనస్సుతోటి ఎంత తాదాత్మ్యం ఉందో అలాగే నీ లోపల ఉన్నటువంటి పరమాత్మతోటి అంత తాదాత్మ్యం వస్తే ఈ జన్మలోనే నీకు మోక్షం వస్తుంది. లోకవాసన ఎక్కువ ఉన్నవారు రామకృష్ణుడు దగ్గరికి వస్తే వారిని పేరుపెట్టి చెప్పేవారు కాదు మాయ వచ్చేస్తోంది, మాయ వచ్చేస్తోంది జాగ్రత్తగా ఉండండి అనేవారు. అంటే లోకవాసన ఉన్నవారితోటి జాగ్రత్తగా లేకపోతే మనలని కూడా వారు లోకంలోకి ఈడ్చేస్తారు అనేవారు.

మీ శరీరయాత్రకి సరిపడ పనులు మీరు చేసుకోవాలి. మిగతా కాలమంతా నన్నే

తెలుసుకోవటానికి ఉపయోగించండి అని పరమాత్మ చెప్పాడు. లోకాన్ని చూసి మోహపడకండి. దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన ఇందులో ఏ వాసనలో పడినా మనం బాహ్యముఖానికి వెళ్ళిపోతాము. కుంజుస్వామి భగవాన్‌కి 30 సం॥లు సేవ చేసారు. కుంజుస్వామికి భగవాన్ అంటే చాలా ఇష్టం. భగవాన్‌ని అందరూ గౌరవించాలని ఆయన ఉద్దేశ్యం. స్వామి నేను కొన్ని ఆశ్రమాలకు వెడుతున్నాను. నువ్వు ఎక్కడనుంచి వచ్చావు అని అడుగుతున్నారు. రమణాశ్రమం నుంచి వచ్చాను అన్నాను. వారు ఏవో ప్రశ్నలు అడుగుతున్నారు. నాకు చదువు తక్కువ వలన నేను సమాధానాలు చెప్పలేకపోతున్నాను అందుచేత నేను పండితుడి దగ్గరకు వెళ్ళి వేదాంతం అంతా నేర్చుకుని వచ్చి అప్పుడు వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తాను దానిని బట్టి మీకు గౌరవం పెరిగిపోతుంది అని కుంజుస్వామి అన్నారు. అదేమిటిరా మళ్ళీ ఈ మాయలో పడుతున్నావు కుంజూ! నేను చదువుకున్నానా? నన్ను ఎవరైనా ఏదైనా అడిగితే నేను ఎలా సమాధానం చెబుతున్నానో నువ్వుకూడా అలాగే చెప్పవచ్చు. ముందు నువ్వు తపస్సు చేసి, అరుణాచలాన్ని నిరంతరం స్మరించుకుంటూ నీ హృదయంలో ఒక సత్యం ఉంది కదా ముందు దానిని తెలుసుకో, దానిని తెలుసుకున్న తరువాత నిన్ను ఏదైనా అడిగితే దానికి సమాధానం నీ హృదయంలోంచే వస్తుంది. మళ్ళీ పాండిత్యం నేర్చుకుని ఆ మాయలో పడకు అన్నారు భగవాన్.

మనం ఎదుటివారి మానసికప్రవృత్తిని బట్టి నడుచుకోవటం మంచిది. అలా నడుచుకుంటే గలాటా ఉండదు. అయితే వారి మనస్తత్వం వలన మనం పాడైపోకుండా చూసుకోవాలి. మన స్వతంత్ర్యం మనం పోగొట్టుకోకూడదు. బాహ్యంగా వారికి అనుకూలంగా ప్రవర్తిస్తున్నప్పటికి లోపల మన జాగ్రత్తలో మనం ఉండాలి. భగవాన్ ఎక్కువ మౌనంగానే ఉండేవారు. మీరు ఏదైనా అడిగితే దానికి సమాధానం చెప్పటం వలన మీరు బాగుపడతారంటేనే సమాధానం చెప్పేవారు, మనం మాట్లాడినా వారు అర్థం చేసుకోలేక వికారం తెచ్చుకుంటారేమో అని ఆయన అనుకుంటే మౌనంగా ఉండేవారు. అది మంచిపద్ధతి. దానికి పాండిత్యంతో సంబంధం లేదు. నన్ను ఆరాధించండి, నన్ను స్మరించండి. ఒక చేత్తో నన్ను పట్టుకోండి, ఒక చేత్తోటి ఇంటిదగ్గర పనులు చేసుకోండి. మీకు ఒక చేత్తోటి నన్ను పట్టుకోవటం అలవాటు అయితే మీ డ్యూటీ అయిత తరువాత నన్ను రెండు చేతులుతోటి పట్టుకుంటారు అని పరమాత్మగీతలో చెప్పాడు. మనకు ఏదైనా కష్టం వస్తూ ఉంటుంది లేకపోతే సుఖం వస్తూ ఉంటుంది ఇవన్నీ మనోకల్పితములే. జ్ఞానికి ఇవన్నీ వస్తూఉంటాయి, పోతూఉంటాయి. జ్ఞాని ఏమనుకుంటాడు అంటే ఇవి గుణాలే ఇవి మనం కాదు ఇవిపూర్వం ఉన్నటువంటి అలవాట్లను బట్టి వస్తున్నాయి అని వాటిని అంటుకోడు, వాడు జ్ఞాని. మీరు అగ్గిపుల్లగీసి సిమెంటు దగ్గర

వెయ్యండి అది అంటుకోదు, పుల్ల ఆరిపోతుంది. అగ్గిపుల్లగీసి గడ్డిమేటు దగ్గర వెయ్యండి గడ్డిమేటు అంతా అంటుకుపోతుంది. జ్ఞాని లోపల గడ్డిమేటు లేదుకాబట్టి అంటుకోదు. మనలోపల గడ్డిమేటు ఉంది కాబట్టి అంటుకుంటాము. జ్ఞానికి కూడా ఒకోసారి గుణాలు వస్తూ ఉంటాయి. ఇవి గుణాలు ఇవి మనంకాదు అని ఆయనకు తెలుస్తూఉంటుంది. అందుచేత సిమ్మెంటుమీద అగ్గిపుల్ల ఆరినట్టే వచ్చి వెళ్లిపోతాయి.

మీకు ఏదైనా కష్టము వస్తే ఇది నిత్యముకాదు అనుకోండి. మీకు సంతోషం వస్తే ఇది నిత్యము కాదు అనుకోండి. మనస్సు వచ్చాక లోకం వస్తోంది, దేవుడు అనే భావన వస్తోంది. మనస్సు వచ్చాక లాభనష్టాలు, కష్టసుఖాలు వస్తున్నాయి. మనస్సు వచ్చాక రాబోయే జన్మల గొడవ, పూర్వజన్మల గొడవ వస్తున్నాయి. మనస్సు వచ్చిన తరువాత ఏమి వస్తున్నాయో అవి అన్నీ నూటికి నూరుపాళ్ళు కల్పితములు. దేనిని పోగొట్టుకుంటే వికారాలు అన్నీ పోతేయో దానిని పోగొట్టుకో అన్నాడు పరమాత్మ. నీకు రాబోయే జన్మలు మనస్సులో ఉన్నాయి. ఆ మనస్సు కాలిపోతే నీ మనస్సులో ఉన్న గొడవలు అన్నీ కాలిపోతాయి. అంటే రాబోయే జన్మలకు వచ్చే బీజాలు అన్నీ కాలిపోతాయి. మేము అక్కడికి వెళ్లిసాధన చేసుకుంటాము, ఇక్కడకు వెళ్లి సాధన చేసుకుంటాము అంటే ఇప్పడు మీకు తినటానికి తిండి ఉంది, కట్టుకోవటానికి బట్టలు ఉన్నాయి, చదువుకోవటానికి పుస్తకాలు ఉన్నాయి, స్నేహాలు చేయటానికి సత్పురుషులు ఉన్నారు. భగవంతుడు అన్ని అవకాశాలు ఇచ్చినప్పడు సాధన చేయలేకపోతే భవిష్యత్తులో సాధన ఏమి చేస్తారు. ఇంక రాబోయే జన్మలో ఎన్ని కష్టాలు ఉన్నాయో, రాబోయే జన్మలో మీరు ఎంత కర్మ అనుభవించాలో అది మీకు తెలియదు, ఇప్పడు మీకు అన్ని పరిస్థితులు బాగున్నప్పడు మీరు సాధన చేయలేకపోతే ఇంక భవిష్యత్తులో ఏదైనా చెడ్డ జన్మలు వస్తే అప్పడు సాధన ఏమి చేయగలరు. లోకంలో ఉన్నవి అన్నీ ఆకర్షణలు అందులో ఏమీ లేదు, అవి నిజంకాదు. మన వాసన బట్టి లోకంలో గొడవలు అన్నీ నిజంకింద అనిపిస్తాయి. బయట ఏమీలేదు. మనం సాధనచేసి పోగొట్టుకోవలసింది అంతా లోపలే ఉంది.

బ్రాహ్మీస్థితి పొందినవాడిమాట ఒక్కమాట చాలు మనకి జ్ఞానం రావటానికి. మీ అజ్ఞానానికి ఏ గురువో, ఏ అవతార పురుషుడో కొంచెము నిప్ప పెట్టాడు అనుకోండి అది కాలటం ఆలస్యం అవ్వవచ్చు. కాని మన అజ్ఞానం కాలిపోతుంది. ఓరామా! దశరథరామా తనువు తాను కాదని తెలిసినవాడికి తపమేల, జపమేల అన్నాడు త్యాగరాజు. నీకు దేహము నేను అనే తలంపు లేకపోతే నీకు జపముతోటి పనేముంది, తపముతోటి పనేముంది. ఏది ఎప్పడు ఎలా జరగాలో అది నీ శరీరం వచ్చినప్పడే ఈశ్వరుడు చేత నియమింపబడి

ఉంటుంది. ఇది అర్థం అయినవాడికి ఇంక చాపల్యం ఏముంది. మనందరం ఎందుకు మంచివారము కాదంటే మన బుద్ధిమంచిది కాదు. ఎందుచేత అంటే న్యూస్‌పెపరులో వచ్చినమాటలు నమ్ముతాము, లోకానికి సంబంధించిన మాటలు నమ్ముతాము కాని భగవంతుడు భగవద్గీతలో చెప్పినమాటలు నమ్మము. ఎందుకంటే మనకి పుణ్యబలం లేదు, ఎప్పడు సత్కర్మ చెయ్యలేదు, మనం సత్పురుషులతోటి సహవాసం చెయ్యలేదు, మనం మంచి చెయ్యక్కర్లేదు ఎవరైనా మంచి చేస్తే చూచి సంతోషించలేము, ఆనందించే స్వభావం మనకి లేదు. ఇంక మనకి శాంతి ఏమిటి? మనకి జ్ఞానం ఏమిటి? మనకి మోక్షం ఏమిటి? శరీరం, మాట, మనస్సు ఇవి మూడే మనకి పుణ్యం సంపాదించి పెట్టినా, మనకి పాపం సంపాదించి పెట్టినా మనం ఒకమాట మాట్లాడేటపుడు పదిసార్లు ఆలోచించి మాట్లాడాలి. మనం పని చేసేటప్పడు ఆ పని మనం అహంకారం కోసం చేస్తున్నామా? గొప్పలకోసం ఆ పని చేస్తున్నామా లేక నిర్మల బుద్ధితోటి నిశ్చలబుద్ధితోటి చేస్తున్నామా అని ఆలోచించుకుని ఆ పని పని కోసమే చేస్తే ఈశ్వరుని దయ మనకు కలుగుతుంది.

మనం ఇంటి దగ్గర ఒంటరిగా కూర్చున్నప్పడు మన మనస్సులోకి తలంపులు వస్తాయి, అవి మంచితలంపులా, చెడ్డతలంపులా అని చూసుకుని చెడ్డతలంపులు అయితే ఓ పరమేశ్వరుడా నాకు చెడ్డతలంపులు వస్తున్నాయి, ఈ చెడ్డతలంపులను తగ్గించి నిన్ను తెలుసుకోవటానికి ఎటువంటి తలంపులు అవసరమో అటువంటి తలంపులు ప్రసాదించు తండ్రీ అని ప్రార్థించాలి. మీరు ఆలోచించినా, మాట్లాడినా, పని చేసినా, సాధన చేసినా వీటి ద్వారా ఈశ్వరుని దయ సంపాదించాలి, అదే నిజమైన సంపాదన. ఈశ్వరుడి దయ కనుక మనకి ఉంటే అసాధ్యము అంటూ ఏమీ లేదు అన్నీ సాధ్యమే, మోక్షం కూడా సాధ్యమే. గాంధీగారు స్వాతంత్ర్యం తీసుకురావటానికి ఆయన జీవితం ఎలా అంకితం చేసారో అలా ఎవరైతే తన హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి తన జీవితాన్ని అంకితం చేసారో, జీవితం పొడుగునా ఈశ్వరుడు పట్ల అర్పణభావంతో పని చేసారో వారికి మాత్రమే హృదయంలో ఉన్న సత్యం తెలియబడుతుంది. మీరు కాలక్షేపానికి చేస్తే చేసుకోండి అది ఊరికేపోదు పుణ్యం వస్తుంది అది రాబోయే జన్మలో ఉపయోగపడుతుంది.

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే అది మనకి అనుభవంలోనికి వచ్చేవరకూ మనం శవాలను మోస్తూనే ఉండాలి. తెలివితక్కువవాడికి తెలివైనవాడికి తేడా ఏమిటి అంటే తెలివైనవాడు అవకాశం వచ్చినప్పడు పట్టుకుని ఉపయోగించుకుంటాడు, తెలివితక్కువవాడు వచ్చిన

అవకాశాన్ని వదిలిపెట్టేస్తాడు. అవకాశం రాకపోతే తెలివైనవాడు ఏమి చేయలేడు, తెలివితక్కువవాడు ఏమీ చేయలేడు. తెలివి తక్కువగా జీవించకు, సూక్ష్మబుద్ధితోటి జీవించు, వివేకవంతుడై జీవించు అని పరమాత్మ చెప్పాడు. మీ మనస్సును మీరు బాగుచేసుకుంటే మీ మాట బాగుంటుంది, మీ చేత బాగుంటుంది, మీ ఆరోగ్యం బాగుంటుంది. మీ బాగుపడిన మనస్సే మీకు మోక్షాన్ని కూడా తెచ్చిపెడుతుంది. మన మనస్సును బాగు చేసుకోవటంకంటే మించిన పని ఈ ప్రపంచంలో లేదని మనకి తెలియటం లేదు. అందుచేత మనం మంచి వాళ్ళము కాదని చెప్తున్నారు. ఉన్నది ఒక్కటే అదే బ్రహ్మము, ఆ బ్రహ్మము గురించి మననం చేస్తూ ఉండు, నువ్వు అబద్ధాన్ని మననం చేయటంకాదు నువ్వు మాట్లాడితే బ్రహ్మం గురించి మాట్లాడు, బ్రహ్మం గురించి ఆలోచించు, బ్రహ్మం గురించి స్మరణ చేస్తూ ఉండు, ఎవరైనా బ్రహ్మం గురించి చెప్తే నువ్వు విను, ఇలా బ్రహ్మమును తెలుసుకోవటానికి ఎవడైతే తన జీవితాన్ని అర్పించుకున్నాడో వాడికి మాత్రమే బ్రహ్మము తెలియబడుతుంది.

ఈ లోకం అసత్యం, ఈ పుట్టుకలు, చావులు అసత్యం, ఈ లాభనష్టాలు అసత్యం, ఈ సుఖదుఃఖాలు అసత్యం ఈ అసత్యాలు గురించి ఎంతకాలము వింటావు వీటి గురించి విని, విని నువ్వు టైరు అవ్వలేదా అంటున్నాడు పరమాత్మ. మీ మనస్సు ఉండవలసిన చోట ఉంటే ఈ లోకం గొడవలు అసలు మిమ్మల్ని ముట్టుకోవు. బ్రాహ్మీస్థితి పొందటానికి మంచితనం సహకరిస్తుంది కాబట్టి మిమ్మల్ని మంచితనం పెంచుకోమన్నారు. ఎదుటవారు చెప్పకోవటానికి మనం మంచివాళ్ళుగా ఉండకూడదు. ఆ మంచి దేవుడు మెచ్చుకోడు. మీకు సహజమైన మంచితనం, నేచురల్ పవిత్రత నీ మనస్సుకి వచ్చినప్పడే దేవుడు నిన్ను ప్రేమించి, ఆయన దయ నీ మీద చూపించి తన స్వరూపాన్ని నీకు ఇస్తాడు వాడు దేవుడు. రాముడు తమ్ముళ్ళు రాముడిని ఎపుడూ అన్నగారిలా చూడలేదు, రాముడుని భగవంతుడిగా చూసారు. అలాగే మనం భగవాన్‌ని శరీరంగా చూడకూడదు. భగవంతుడికింద చూస్తేనే ఆయన చెప్పినమాట మన హృదయంలోనికి చొచ్చుకొనివెడుతుంది. భగవంతుడిగా చూడకపోతే ఆ మాట మన హృదయంలో ప్రవేశించదు. ఎందుచేతనంటే భగవాన్ దైవానికి భిన్నంగా లేరు. భగవాన్ దేని గురించి అయితే చెప్తున్నారో అది అయి చెప్తున్నారు, ఆ వస్తువు భగవాన్ వేరుకాదు.

మానవుడి దుఃఖానికి ఒకటే కారణం. అది కర్తృత్వబుద్ధి, అదే దేహము నేను అనే తలంపు. నీకు కర్తృత్వంపోతే దుఃఖం లేదు, అది ఉన్నంతసేపు నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. దేహబుద్ధిలో దుఃఖం ఉంది, ఆత్మబుద్ధిలో దుఃఖం లేదు. అందుచేత మనం దేహబుద్ధిలో నుండి ఆత్మబుద్ధిలోకి

ప్రయాణం చేయాలి. ఈ ప్రయాణం బయట జరిగేది కాదు లోపల జరగాలి. అశాంతిలోనుండి శాంతిలోనికి వెళ్ళాలంటే, మృత్యువులో నుండి అమృతత్త్వంలోనికి వెళ్ళాలంటే ఈ దేహబుద్ధిని విడిచిపెట్టి ఎవరైతే ఆత్మబుద్ధిని అందుకున్నారో వారు మాత్రమే మృత్యువులో నుండి అమృతత్త్వమును పొందుతారు. ఎవరైతే అమృతస్థితిని పొందారో వారు ఇంక శవాలను మోయనక్కరలేదు. వ్యభిచారభక్తి తగ్గించుకోండి అంటాడు పరమాత్మ. వ్యభిచారభక్తి అంటే మనస్సు స్థిరంగా ఉండదు, రోజుకి ఒకలాగ ఉంటారు. మీకు వ్యభిచార భక్తి వద్దు. అవ్యభిచారభక్తి నాపట్ల కట్టివేటు చేసుకోండి. భక్తి రోజుకి ఒక రకంగా ఉండ కూడదు, భక్తి నిలకడగా ఉండాలి, నా పట్ల విశ్వాసం మీకు స్థిరంగా ఉండాలి, నా పట్ల ప్రేమ విడిచిపెట్టవద్దు. ఎటుగాలి వేస్తే అటు చెదిరిపోయేది వ్యభిచారభక్తి. నువ్వు ఇతరులకు సేవ చేస్తున్నావు అనుకో ఇతరులకు చెయ్యటంలేదు వారి రూపంలో ఉన్న నాకే చేస్తున్నావు అనుకో అలాగ అనుకుంటే ఆ సేవ నాకు అందుతుంది అప్పుడు నా అనుగ్రహానికి పాత్రుడవుతావు అన్నాడు పరమాత్మ.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-09-2009, అయి భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు రమణస్వామి మదురైనుండి అరుణాచలం విచ్చేసిన రోజు. ఆయన ఒకరోజు బడికి వెడుతూ మీరు ఎక్కడ నుండి వస్తున్నారు అని ఎదురుగా వచ్చిన ఒక బంధువును అడిగారు. నేను అరుణాచలం నుండి వస్తున్నాను అని ఆయన చెప్పారు. అరుణాచలం అనేటప్పటికి ఆయనకు భగవంతుడు స్ఫురించాడు కాని, అది ఒక క్షేత్రం అని ఆయనకు స్ఫురించలేదు. అరుణాచలం అంటే భగవంతుడు కదా, భగవంతుడు దగ్గర నుండి మనిషి రావటం ఏమిటి అనుకొన్నాడు. అరుణాచలం అనేది ఒక పుణ్యక్షేత్రం అని నీకు తెలియదా? దానినే తిరువణ్ణామలై అంటారు, అక్కడ నుండే వస్తున్నాను అని ఆ బంధువు చెప్పాడు. 1896వ సం॥లో ఆయనకు మరణానుభవం కలిగింది. అంతకుముందు ఆయనకు పెద్దగా భక్తి లేదు, ఎప్పుడైనా మీనాక్షి గుడికి వెళ్ళేవారు, ఆయన బ్రహ్మం గురించి చదువలేదు, శ్రవణం చేయలేదు, మననం చేయలేదు. మరి మరణానుభవం ఎలా కలిగింది అంటే అది దేవరహస్యం. మనం దేహాన్ని ఆత్మ అనుకొంటున్నాము, మనస్సును ఆత్మ అనుకొంటున్నాము, మనం అనుకొనేది ఏదీ నిజం కాదు. మనం ఎన్ని గ్రంథాలు చదివినా దేహాన్ని ఆత్మ అనుకొన్నంత కాలం, మనస్సును ఆత్మ అనుకొన్నంతకాలం మీరు ఎన్ని జన్మలు ఎత్తినా, వెయ్యి కోట్లు సంపాదించినా మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు. మేము సంతోషంగా ఉన్నాము అని మీరు